యూనిట్
II

# 5. పద్యరత్నాలు

-వివిధ కవులు

## చదవండి -ఆలోచించండి చెప్పండి

ఆ॥వె॥ మృగము మృగమనుచును
మృగమును దూషింత్రు
మృగముకన్న చెడ్డ
మూర్ఖుడగును
మృగముకన్న గుణము
మూర్ఖునకేదయా
విశ్వదాభిరామ! వినురవేమ!
– వేమన

### ప్రశ్నలు

1. పద్యం భావం చెప్పండి.
2. ఇలాంటి పద్యాలను ఏమంటారు?
3. మీకు తెలిసిన ఇతర శతక పద్యాలు చెప్పండి.
4. ఇలాంటి పద్యాలను కవులు ఎందుకు రాసి ఉంటారు?
5. వీటివల్ల సమాజానికి ఏం మేలు జరుగుతుంది?

© SCERT not to be republished

### ఉద్దేశం

నైతిక విలువను పెంపొందింపజేసే వివిధ శతకాలలోని నీతులను తెలియజెప్పడం ఈ పాఠ్యభాగ ఉద్దేశం. ఈ పాఠంలోని పద్యాలు వివిధ కవుల శతకాల లోనివి.

(*ఈ పాఠంలోని పద్యాలన్నీ కంఠస్థం చేయాలి.)

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

*ఉ. కోరికతో ధనాఢ్యుఁడని కుత్సితు నల్పుని దుష్టచిత్తునిన్
జేరినవార లీప్సితముఁ జెంది సుఖింపరు హానిఁ గాంతు రా
చారు ఫణాగ్రభాగ విలసన్మణిరాజము గల్గి వెల్గినన్
గ్రూర భుజంగమున్ గవయ గూడునె శ్రీకర రాజశేఖరా! (1)





*మ. కుల శైలంబులు పాలు పెల్లగిలి దిక్కూలంబునం గూలినం
జలధు ల్మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్
జలజాతప్రియ శీతభానులు యథా సంచారముల్దప్పినం
దలకం దుబ్బడు చొప్పుదప్పుడు భవద్భక్తుండు సర్వేశ్వరా! (2)

*ఉ. సత్యం బెప్పుడు దప్పడేనియు దురాచారుండు గాడేని యౌ
చిత్యం బేమరడేని దుర్జనుల గోష్ఠిం బొందడే భక్తి సాం
గత్యం బాదట బాయడేని, మదనగ్రస్తుండు గాడేని నీ
భృత్యుండాతడు మూడు లోకములలోఁబెంపొందు సర్వేశ్వరా! (3)





*శా. గాజుంబూస యనర్ఘ రత్న మగునా? కాకంబు రాయంచయౌ
నా? జోరీగ మధువ్రతేంద్ర మగునా నట్టెన్ము పంచాస్యమౌ
నా? జిల్లేడు సురావనీజమగునా? నానాదిగంతంబులన్
రాజౌనా ఘనలోభి దుర్జనుడు? భర్గా! పార్వతీ వల్లభా! (4)


*సీ. సాధు సజ్జనులతో జగడ మాడినఁ గీడు
కవులతో వైరంబు గాంచఁగీడు,
పరమదీనులఁ జిక్కఁబట్టి కొట్టినఁ గీడు,
భిక్షంగాండ్రను దుఃఖ పెట్టఁగీడు
నిరు పేదలను చూచి నిందఁ జేసినఁగీడు
పుణ్యవంతులఁ దిట్టఁబొసగుఁగీడు
సద్భక్తులను దిరస్కారమాడినఁగీడు,
గురుని ద్రవ్యము దోఁచుకొనినఁ గీడు
తే॥గీ॥ దుష్ట కార్యములొనరించు దుర్జనులకు
ఘనతరంబైన నరకంబు గట్టిముల్లె
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్ట సంహార! నరసింహ! దురితదూర! (5)



© SCERT not to be republished

*శా॥ స్నానంబుల్ నదులందు జేయుట గజ స్నానంబు చందంబగున్
మౌనంబొప్ప జపించు వేద మటవీ మధ్యంబులో నేడ్పగున్
నానాహోమములెల్ల బూడిదలలోన న్వేల్చు నెయ్యై చను
న్నీ నామోక్తియు నీ పదాబ్జరతియున్ లేకున్న నారాయణా!(6)






*ఉ. రంగదరాతి భంగ, ఖగ రాజతురంగ, విపత్పరంపరో
త్తుంగ, తమః పతంగ, పరితోషితరంగ, దయాంతరంగ, స
త్సంగ, ధరాత్మజాహృదయసారసభృంగ, నిశాచరాబ్జమా
తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ ! (7)

*మ. పవి పుష్పంబగు, నగ్నిమంచగు, నకూపారంబు భూమీస్థలం
బవు, శత్రుం డతిమిత్రుడౌ, విషము దివ్యాహారమౌ నెన్నగా
నవనీమండలి లోపలన్ శివశివే త్యాభాషణోల్లాసికిన్
శివ! నీ నామము సర్వవశ్యకరమౌ! శ్రీకాళహస్తీశ్వరా! (8)





*క. ఆచార్యున కెదిరింపకు
బ్రోచినదొర నింద సేయఁ బోకుము కార్యా
లోచనము లొంటిఁ జేయకు
మాచారము విడువఁ బోకుమయ్య కుమారా ! (9)



*క. ఉడుముండదె నూఱేండ్లునుఁ
బడియుండదే పేర్మిఁ బాము పదినూఱేండ్లున్
మడువునఁ గొక్కెర యుండదే
కదునిలఁ బురుషార్థపరుడు గావలె సుమతీ! (10)

© SCERT not to be republished

## కవి పరిచయాలు

ఈ పాఠంలోని ప్రతి పద్యమూ ఒక విలువైన రత్నమే. ఈ పద్యాలన్నీ వేర్వేరు కవులు రాసిన శతకాల్లోనివి. ఆయా కవుల వివరాలు చదవండి.

1. శ్రీకర రాజశేఖరా! అనే మకుటంతో ఉన్న పద్యం 'రాజశేఖరశతకం' లోది. దీని కర్త 'సత్యవోలు సుందరకవి'. 20 వ శతాబ్దికి చెందినవారు. భక్తిభావం ఉట్టిపడేటట్లు సులభశైలిలో శతకాన్ని రచించారు.

2,3. సర్వేశ్వరా! అనే మకుటంతో ఉన్న పద్యాలు 'సర్వేశ్వర శతకం'లోవి. వీటిని 'యథావాక్కుల అన్నమయ్య' రచించారు. ఇతడు 12 వ శతాబ్దానికి చెందిన శివకవి. భక్తిభావబంధురమైన కవిత్వం చెప్పగల దిట్ట.

4. 'భర్గా! పార్వతీ వల్లభా!' అనేమకుటంతో ఉన్న పద్యం 'కూచిమంచి తిమ్మకవి' రచించిన 'శ్రీభర్గశతకం' లోది. ఈయన 17 వ శతాబ్దానికి చెందిన వారు. 'సీతాసుందరీ పరిణయం' అనే ప్రబంధాన్ని కూడా రచించారు.

5. 'భూషణ వికాస శ్రీధర్మ పురనివాస! దుష్టసంహార! నరసింహ! దురితదూర!' అనే మకుటంతో ఉన్న పద్యం 'కాకుత్సంశేషప్ప కవి' రాసిన 'నరసింహ శతకం' లోది. వీరు 18వ శతాబ్దానికి చెందినవారు. గోదావరీ తీరంలోని కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి గ్రామంలో వెలసిన నరసింహస్వామిని ప్రస్తుతిస్తూ రాసిన శతకం ఇది.

6. నారాయణా! అన్న మకుటంతో ఉన్న పద్యం నారాయణ శతకం లోది. రాసింది బమ్మెర పోతన. 15 వ శతాబ్దానికి చెందిన భక్తకవి. మనస్సుకు ఆహ్లాదకరమైన అందమైన పద్యాలు చెప్పిన సహజపండితులు.

7. దాశరథీ! కరుణాపయోనిధీ! అనే మకుటంతో ఉన్న పద్యం దాశరథి శతకం లోది. దీన్ని రచించిన కవి కంచర్ల గోపన్న. 17వ శతాబ్దానికి చెందినవారు. ఈయనకే రామదాసు అనే పేరుంది.

8. శ్రీకాళహస్తీశ్వరా! అనే మకుటంతో ఉన్న పద్యం 'ధూర్జటి' కవి రచించిన శ్రీకాళహస్తీశ్వరశతకం లోది. వీరు 17వ శతాబ్దానికి చెందిన వారు.

9. కుమారా! అనే మకుటంతో ఉన్న పద్యం 'కుమార శతకం' లోది. కవి 'పక్కి అప్పలనర్సయ్య'. వీరు 16వ శతాబ్దానికి చెందినవారు.

10. 'సుమతీ!' అన్న మకుటంతో ఉన్న పద్యం 'సుమతి శతకం' లోది. కవి బద్దెన వీరు 13వ శతాబ్దానికి చెందినవారు.

### ప్రక్రియ–శతకం

నూరుపద్యాలు గల రచనను 'శతకం' అంటారు. సాధారణంగా శతకాలలో నూరునుండి నూట ఎనిమిది పద్యాలుంటాయి. శతక పద్యాలకు మకుటం ప్రధానం. మకుటం అంటే ప్రతిపద్యం చివర ఉండేది. ఇది పదంగా గాని, అర్థపాదంగా గాని, పాదంగాగాని,పాదద్వయంగా గాని ఉండవచ్చు. శతకంలోని పద్యాలు ముక్తకాలు, అనగా ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది.

© SCERT not to be republished

## పద్యాల భావాలు.

1. శుభాన్ని కలిగించే రాజశేఖరా! మోసకారియైన ధనవంతుని కోరి చేరితే, కోరికలు తీరకపోగా కీడు కూడా కలుగుతుంది. పడగమీద విలువైన మణి ప్రకాశిస్తూ ఉన్నప్పటికీ, భయంకరమైన పాముతో కలిసిఉండరు కదా!

2. సర్వేశ్వరా! కుల పర్వతాలన్నీ చెల్లా చెదురైనా, సముద్రాలు హద్దులను దాటి ఉప్పొంగినా, సూర్యచంద్రులు గతి తప్పినా నీ భక్తుడు చలించడు, అణు మాత్రం గర్వపడడు, నీతిమార్గాన్ని తప్పడు.

3. సర్వేశ్వరా! ఈ మూడులోకాల్లో సత్యాన్ని తప్పనివాడు, చెడునడత లేనివాడు, తగినట్లు మెలిగేవాడు, చెడ్డవాళ్ళతో స్నేహం చేయనివాడు, భక్తుల సాంగత్యాన్ని వదిలిపెట్టనివాడు, సంసారమోహంలో చిక్కుకోనివాడే నీ సేవకుడు.

4. భర్గా! పార్వతీపతీ! ఎక్కడైనా, ఎప్పటికీ గాజుపూస విలువైన రత్నం కాజాలదు; కాకి రాజహంస కాజాలదు. జోరీగ తేనెటీగ కాజాలదు. దున్నపోతు సింహం కాజాలదు. జిల్లేడుచెట్టు కల్పవృక్షం కాజాలదు. అట్లాగే పిసినారి అయిన దుర్మార్గుడు రాజు కాలేడు.

5. అలంకారాలచేత శోభిల్లేవాడా! ధర్మపురి అనే గ్రామంలో వెలసినవాడా! దుష్టులను సంహరించేవాడా! పాపాలను పోగొట్టేవాడా! నరసింహా! మంచివారితో గొడవ పెట్టుకొంటే హాని జరుగుతుంది. కవులతో శత్రుత్వం పెట్టుకొన్నా, దీనులైన వారిని పట్టుకొని కొట్టినా, భిక్షగాళ్ళను దుఃఖపెట్టినా, పేదవారిని నిందించినా, పుణ్యాత్ములను తిట్టినా, భక్తులను తిరస్కరించినా గురువుల సంపదను దోచుకున్నా హాని జరుగుతుంది. ఇలా చెడు పనులు చేసే వారికి నరకం తప్పదు.

6. నారాయణా! నీ నామం స్మరించనివాడు, నీ మీద భక్తిలేనివాడు ఎన్ని నదుల్లో స్నానం చేసినా అది ఏనుగు స్నానం వంటిదే అవుతుంది. అతడు మౌనంగా మంత్రాలను జపించినా అది అరణ్యరోదనే అవుతుంది. ఎన్ని హోమాలు చేసినా అది బూడిదలో పోసిన నెయ్యే అవుతుంది.

7. భద్రగిరిపై కొలువైన ఓ స్వామీ! దశరథుని పుత్రుడా! సముద్రమంతటి దయగలవాడా!నీవు యుద్ధరంగంలో శత్రువులను నాశనం చేసినవాడవు. గరుత్మంతుడినే వాహనంగా కలవాడవు. కష్టాలనే కారుచీకట్లను తొలగించే సూర్యుడవు. సంతోషమనెడి అలలతో నిండిన దయగల హృదయం గలవాడవు. సీతాదేవి హృదయమనెడి పద్మానికి తుమ్మెద వంటివాడవు. రాక్షసులనే కలువలను నాశనం చేసే ఏనుగువంటివాడవు. మంగళప్రదమైన దేహం కలిగిన వాడవు.

8. శ్రీకాళహస్తి క్షేత్రంలో వెలసిన ఓ పరమేశ్వరా! నీ నామస్మరణం వల్ల అన్నీ స్వాధీనమవుతాయి. ఈ భూలోకంలో 'శివ! శివ!' అని ఉత్సాహంతో పలికే వానికి వజ్రాయుధం – పుష్పంలా, నిప్పు – మంచులా, సముద్రం– నేలలా, పగవాడు – స్నేహితునిలా, విషం – అమృతంలా సులభసాధ్యాలుగా మారతాయి.

© SCERT not to be republished

9. ఓ కుమారా! చదువు చెప్పే గురువు మాటకు ఎదురుచెప్పకు. పోషించే యజమానిని నిందించకు; ఒంటరిగా అనేక విధాలైన ఆలోచనలు చేయకు; మంచినడవడికను వదిలిపెట్టకు. ఇలా చేయడం వల్ల నీకు ఎంతో మేలు కలుగుతుంది. అందరూ నిన్ను అనుసరిస్తారు.

10. సుమతీ! వంద సంవత్సరాలు జీవించే ఉడుం, వెయ్యి సంవత్సరాలు జీవించే పాము, చెఱువు నందు చాలాకాలం బతికే కొంగ – ఎన్ని సంవత్సరాలు బ్రతికినా ప్రయోజనముండదు. మంచి చేయాలనే ఆలోచన కలిగి ధర్మార్థకామమోక్షాలను సాధించేవాడే ఉత్తముడు.

## ఇవి చేయండి

### I. అవగాహన – ప్రతిస్పందన

**అ) కింది అంశాల గురించి మాట్లాడండి.**

1. పాఠంలోని పద్యాలను రాగంతో భావయుక్తంగా పాడండి. భావాలు చెప్పండి.
2. పాఠంలోని పద్యాల ఆధారంగా చర్చించండి.

   i. నడవడిక ii. గుణగణాలు iii. మార్గదర్శకం iv. నైతికవిలువలు

3. పాఠంలో మీకు నచ్చిన పద్యాలేవి? ఎందుకో చెప్పండి.

**ఆ) 9,10 పద్యాలకు ప్రతిపదార్థం రాయండి.**

**ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. దుర్గుణాలు గల ధనవంతునితో చేరితే ఏమవుతుంది?
2. 'కులశైలంబులు' అనే పద్యంలో అన్నమయ్య ఏం చెప్పాడో రాయండి?
3. ఎలాంటి జీవనం నిష్ప్రయోజనమని బద్దెన అంటున్నాడు?
4. ధూర్జటి ప్రకారం అన్నీ సులభసాధ్యమయ్యేలా చేసేది ఏది?
5. "భద్రగిరి పై కొలువైనస్వామి" అంటే ఎవరు? ఆయనను కవి ఏమని వర్ణించాడు?
6. భగవంతుని సేవకుని లక్షణాలను తెలపండి?

© SCERT not to be republished

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. 'లోభియైనవాడు రాజు గా తగడు' ఇది సమర్థనీయమేనా? ఎందుకు?
2. నరసింహ శతకపద్యంలో గల విషయాలు నేటి సమాజానికి ఎంతవరకు అవసరమో వివరించండి.
3 'ధనంపై కోరికతో అల్పుని వద్ద చేరితే హాని కలుగుతుంది' దీనికి సంబంధించి మీకు తెలిసిన సంఘటనను వివరించండి.
4. 'పవి పుష్పంబగు' పద్యభావాన్ని సొంతమాటల్లో రాయండి.
5. అరణ్యరోదనం అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాల్లో వాడతారు?
6. "మంచి నడవడికను వదలిపెట్టకు" అని తెలుసుకొన్నారు కదా! మంచి నడవడికకు కొన్ని ఉదాహరణలు రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. నిజమైన భక్తునికి ఉండదగిన లక్షణాలను గురించి రాయండి.
2. మంచి విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలు, ఉండకూడని లక్షణాలను సొంత మాటల్లో రాయండి.

**ఇ) సృజనాత్మకంగా రాయండి.**

ధనమున్న వాళ్ళు తమ ధనాన్ని దానం చేయడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని ఈ పాఠంలో చదువుకున్నాం కదా! ఈ భావం వచ్చేటట్లు అనాథశరణాలయాలకు, వృద్ధాశ్రమాలకు, బీదలకు విరాళాలు ప్రకటించమని ధనవంతులకు, వదాన్యులకు ఒక 'కరపత్రం' ద్వారా విజ్ఞప్తి చేయండి.

(లేదా)

మీ పాఠం ఆధారంగా కవుల భావాలను నీతివాక్యాల రూపంలో రాయండి.

(లేదా)

పాఠంలో మీకు నచ్చిన ఏదైనా పద్యానికి తగిన గేయాన్ని గాని, కవితను గానీ రాయండి.

**ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.**

"మంచి గుణాలుగల వ్యక్తికి రూపం, ధనం లేకపోయినప్పటికీ వాణ్ణి బుద్ధిమంతులు చక్కగా గౌరవిస్తారు." అని చదువుకున్నాంకదా! అటువంటి వ్యక్తులెవరైనా మీకు తెలిసిన వారున్నారా? వారి గురించి తెలపండి.

(లేదా)

ఈ పాఠంలో చెప్పిన గుణాల్లో ఏయే మంచి గుణాలను మీరు అలవరచుకోవాలనుకుంటున్నారో పట్టిక తయారు చేయండి.

© SCERT not to be republished

III .భాషాంశాలు

## పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలను పాఠ్యపుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం'లో వెతికి వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

ఉదా।। మడువు = కొలను

కొంగ మడువులోని చేపలను తినాలని చూసింది.

| | | |
|---|---|---|
| 1. అవని | 2. కొక్కెర | 3. భృంగం |
| 4. అనర్ఘం | 5. పవి | 6. తురంగం |
| 7. పంచాస్యం. | 8. దురాచారుడు | 9. దివ్యాహారం |

**ఆ) కింది పదాలకు పదపట్టికలో పర్యాయపదాలు వెతికి వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా।। ఈప్సితం – కోరిక – వాంఛ

కళ్ళారా హిమాలయాలను చూడాలని రవికి చిరకాల వాంఛ. ఎన్నోసార్లు తన కోరికను తల్లిదండ్రుల ముందు బయటపెట్టాడు. మొత్తానికి తన ఈప్సితం తీరునట్లు తల్లిదండ్రులు అనుమతిచ్చారు.

| | | | |
|---|---|---|---|
| 1. అవని | 2. విపత్తు | 3. ఏనుగు | 4. భుజంగం |
| 5. తురంగం | 6. అవని | 7. సత్యం. | |

**ఇ) కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. దాశరథి | 2. గురువు | 3. జలజాతం | 4. పంచాస్యం | |
| 5. మధువ్రతం | | 6. అబ్జం | 7. ధూర్జటి | 8. ధర |

**ఈ) పాఠ్యాంశం ఆధారంగా కింది నానార్థాలకు సంబంధించిన మూలపదాలను వెతికి రాయండి.**

1. నీరు, గరళం = ...........................
2. చీకటి, తమోగుణం, దుఃఖం = ...........................
3. ఏనుగు, మూడడుగుల దూరం, ఎనిమిది = ...........................
4. అవయవం, ఒకదేశం, భాగం = ...........................

**ఉ) కింది జాతీయాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

1. గజస్నానం :
2. అరణ్యరోదనం :
3. బూడిదలో పోసిన నెయ్యి :

© SCERT not to be republished

## వ్యాకరణం

**అ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.**

ఉదా :- ఫణాగ్రము = ఫణ + అగ్రము - సవర్ణదీర్ఘసంధి

| పదం | | విసంధిరూపం | సంధిపేరు |
|---|---|---|---|
| 1. | పరమాన్నం | | |
| 2. | పంచాస్యం | | |
| 3. | పదాబ్జం | | |
| 4. | ధనాఢ్యుడు | | |
| 5. | మధువ్రతేంద్రం | | |
| 6. | సర్వేశ్వరా | | |

**ఆ) కింది పదాలను కలిపి ఏ సంధులో గుర్తించండి.**

ఉదా :- పలాయనంబు + అగుట =పలాయనంబగుట - ఉకారసంధి

| | | |
|---|---|---|
| 1. | అభోజ్యములు + ఔట = | |
| 2. | కోపంబు + ఎక్కువ = | |
| 3. | భృత్యుండు + ఆతడు = | |
| 4. | ప్రాప్తము + అగు = | |
| 5. | రాజు + ఔనా = | |

**ఇ) పాఠం చదివి కింది సంధులకు సంబంధించిన ఉదాహరణలను వెతికి రాయండి. ఆ సంధి పదాలను విడదీసి, సూత్రాలను నోటు బుక్కులో రాయండి.**

1. యణాదేశ సంధి : ____________________
2. గుణసంధి : ____________________
3. సవర్ణదీర్ఘసంధి : ____________________
4. ఉత్వసంధి : ____________________

© SCERT not to be republished

## ఈ) నూతన పరిచయం – 'జశ్త్వ' సంధి (సంస్కృత సంధి)

ఉదా :- సత్ + భక్తులు = సద్ + భక్తులు → సద్భక్తులు

పై సంధి పదాలను పరిశీలించండి. మొదట విడదీసిన పదాలలోని 'త'కారస్థానములో 'ద'కారం ఆదేశంగా వచ్చి 'సద్భక్తులు' అనే రూపం వచ్చింది.

ఈవిధంగా మొదటి పదం చివర క,చ,ట,త,ప (పరుషాలు) లలో ఏదైనా ఒక అక్షరం ఉండి, రెండవ పదం మొదట కఖ,చఛ,టఠ,తథ,పఫ లు మరియు శ,ష,స లు తప్ప మిగిలిన హల్లులు, అచ్చులలో ఏ అక్షరం ఉన్నా గ,జ,డ,ద,బలు వరుసగా ఆదేశమౌతాయి.

కింది పదాలను విడదీయండి.

దిగంతము = ________ + ________

సముదంచత్ = ________ + ________

మృద్ఘటము = ________ + ________

వాగీశుడు = ________ + ________

వాగ్యుద్ధం = ________ + ________

వాగ్వాదం = ________ + ________

తద్విధం = ________ + ________

**సూత్రం :** "పరుషములకు వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలు శ,ష,స లు తప్ప మిగిలిన హల్లులు కానీ అచ్చులుకానీ పరమైతే వరుసగా సరళాలు ఆదేశమవుతాయి.

## (ఊ) సమాసాలు – ఖాళీలను పూరించండి.

| సమాసం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| 1. శీతభానులు | | |
| 2. | ధనముచేత ఆఢ్యుడు | |
| 3. | | ద్విగుసమాసం |
| 4. దుష్టచిత్తుడు | | |
| 5. | క్రూరమైన భుజంగం | |
| 6. కార్యాలోచనము | | |
| 7. | | షష్ఠీతత్పురుషసమాసం |
| 8. | అనర్ఘమైన రత్నాలు | |

© SCERT not to be republished

## ఋ) కర్మధారయ సమాసాలు.

### (i) ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం

'కలువ కనులు' అనే సమాసంలో కలువ, కనులు అనే రెండు పదాలున్నాయి. దీనికి కలువల వంటి కన్నులు అని అర్థం. అంటే కన్నులను కలువలతో పోల్చడం జరిగింది. సమాసంలోని మొదటి (పూర్వ) పదం ఇక్కడ ఉపమానం కాబట్టి, దీన్ని ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం అంటారు.

### (ii) ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం

'పదాబ్జము' అనే సమాసంలో పద (పాదం) మరియు అబ్జము (పద్మం)అనేరెండు పదాలున్నాయి. వీటి అర్థం పద్మము వంటి పాదము అని. ఇక్కడ పాదాన్ని పద్మం (తామరపూవు) తో పోల్చడం జరిగింది. కాబట్టి పాదం ఉపమేయం, పద్మం ఉపమానం. ఉపమానమైన అబ్జము అనే పదం ఉత్తర పదంగా (రెండవ పదం) ఉండడం వల్ల దీన్ని **ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం** అంటారు.

| ఉదా- సమాస పదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| **తేనెమాట** | తేనెవంటి మాట<br>(తేనే - ఉపమానం;మాట- ఉపమేయం) | ఉపమానపూర్వపద కర్మధారయ |
| **తనూలత** | లతవంటి తనువు<br>(తనువు-ఉపమేయం;లత-ఉపమానం) | ఉపమాన ఉత్తరపద కర్మధారయ |
| **చిగురుకేలు** | చిగురువంటి కేలు<br>(చిగురు-ఉపమానం; కేలు-ఉపమేయం) | ఉపమానపూర్వపద కర్మధారయ |
| **కరకమలములు** | కమలములవంటి కరములు<br>(కరములు-ఉపమేయం; కమలములు-ఉపమానం) | ఉపమాన ఉత్తరపద కర్మధారయ |

**కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

సుధామధురం, జుంటిమోవి, ముఖారవిందం, కాంతామణి

## ౠ) రూపక సమాసం

"విద్యాధనం" దీనిలో విద్య, ధనం అనే రెండు పదాలున్నాయి. పూర్వపదమైన విద్య, ధనంతో పోల్చబడింది. కాని "విద్య అనెడి ధనం" అని దీని అర్థం కనుక, రెండిటికీ మధ్య భేదం లేనంత గొప్పగా చెప్పబడింది. ఈ విధంగా ఉపమాన, ఉపమేయాలకు భేదం లేనట్లు చెబితే అది రూపక సమాసం.

ఉదాః- హృదయసారసం - హృదయమనెడి సారసం

సంసారసాగరం - సంసారమనెడి సాగరం

© SCERT not to be republished

**కింది పదాలకు విగ్రహవాక్యాలు రాయండి.**

జ్ఞానజ్యోతి, అజ్ఞానతిమిరం, అమృతవాక్కు

**ఎ) ఛందస్సు - నూతన పరిచయం 'మత్తేభం'**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| పవిపు | ష్పంబగు | నగ్ని మం | చగు న | కూపారం | బు భూమీ | స్థలం |

పై గణవిభజనను పరిశీలించండి. ఇలా స, భ,ర,న, మ, య, వ, అనే గణాలు వరుసగా ప్రతి పాదంలో వస్తే అది 'మత్తేభ' పద్యం అవుతుంది. అన్ని వృత్తపద్యాల్లాగే దీనికి ప్రాసనియమం ఉంటుంది. యతి 14వ అక్షరానికి చెల్లుతుంది. (ప-పా)

మీరు కూడా పాఠంలోని పై పద్యంలో మిగిలిన మూడు పాదాలకూ గణవిభజన చేసి పై మత్తేభ లక్షణాలు సరిపోయాయో లేదో చూడండి.

**ఏ) అలంకారాలు**

గతంలో మీరు నేర్చుకున్న రూపక, ఉపమాలంకారాలు 6,7 పద్యాల్లో ఉన్నాయి. ఏ పద్యంలో ఏ అలంకారముందో గుర్తించి లక్ష్యలక్షణ సమన్వయం చేయండి.

వాక్యాలకు బింబ ప్రతిబింబత్వం (ఒక భావం అర్థం గావటానికి మరో భావం అద్దంలో చూపించినట్లు) ఉంటే దాన్ని **దృష్టాంతాలంకారం** అంటారు.

ఉదా- ఓ రాజా నీవే కీర్తిమంతుడవు - చంద్రుడే కాంతి మంతుడు.

దృష్టాంత అలంకారానికి రెండు ఉదాహరణలు రాయండి.

©SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

ఒకటో తరగతినుండి తొమ్మిదో తరగతి వరకు అన్ని తెలుగు పాఠ్యపుస్తకాల్లోని నీతి పద్యాలను సేకరించి, ఒక పుస్తకంలా తయారు చేయండి. మీ తరగతిలో ప్రదర్శించండి.



**విద్య మనిషి జీవితానికి వెలుగునిస్తుంది. మనిషి వికాసానికి, నడవడికి తోడ్పతుంది. తేజోమయులను చేస్తుంది.**

-స్వామి వివేకానంద